సాయంత్రం ఏడు అవ్వొస్తోంది.

చీకటి క్రమేపి చిక్కబడటం ప్రారంభించింది.

జంక్షన్లో వీధి దీపం దేదీప్యమానంగా వెలుగునిస్తోంది. ఎడంచేతి కామధేను వేపు భారంగా మలుపు తిరగ బోతున్న కాళీప్రసాద్-కుడి చేతి వేపు విమల్ షోరూమ్ నుంచి వేగంగా పోతున్న నాగేశ్వరావ్-ఒకళ్లనొకళ్లు చూసుకొని, మెల్లు దిగి షాపుల మధ్య చేరోవేపూ నిల్చుండిపోయి, ఒకర్నొకరు పరీక్షగా చూసుకుంటున్నారు - తామెరిగిన వ్యక్తి ఔనా కాదా అన్న సందిగ్ధావస్థలో.

అవతల వ్యక్తిని తొందరగానే పోల్చుకోగలిగేడు - కాళీ. కానీ, అతడ్ని పలకరించటానికి మనస్కరించలేదు. ముఖం తిప్పేసుకొని తన దోవన తాను పడ్డాడు. అతని గుండె లోలోపల పొరల్లో ఎక్కడో సన్నని మంట రగుల్కొంది.

కాళీ నడకని చూడగానే అతను ఎవరైనదీ జ్ఞప్తికి వచ్చింది - నగేష్‌కి.

"ప్రసాద్! కాళీ ప్రసాద్!" ఆగమన్నట్లుగా బిగ్గరగా పిలిచేడు నగేష్.

అంతవరకూ భారంగా నడుస్తున్న అతను, తనని కాదన్నట్లు వేగం పెంచి నడవసాగేడు-కాళీ. తనని అందుకుందుకు వడివడిగా వస్తున్న అతడి అలికిడి వినవస్తోంది. కానీ, వెనుదిరిగి చూడలేదు. అతని గుండెల్లో మంట మెల్లమెల్లగా రాజుకుంటోంది.

# అల్ప సంతోషి

## కేసరి

పరుగున వచ్చి, అతడ్ని చేరి, వెనుక నుంచి చేయి అందుకొని, అతడ్ని ఆపి-

"కాళీ!...నన్ను...నన్ను గుర్తుపట్టలేదా! నేను...నేను, నాగేశ్వరావ్‌ని... నగేష్‌ని..." ఆత్రంగా ఆయాసంగా మాట్లాడుతున్నాడు అతడు.

గుర్తులేకపోతే కదా, ఇప్పుడు కొత్తగా గుర్తు చేసుకుందుకు. అయినా ఎగాదిగా చూసేడు. మనిషి రూపురేఖల్లో పెద్దగా మార్పులేదు. పూర్వంమీద కొంత పుష్టిగా ఉన్నాడు. రంగు తేలేడు. నీటుగా సూటూ బూటూ వేసేడు. మనిషి దర్పంగా నుంచున్నాడు. తెలుగు ఉచ్చారణలో ఏదో కొత్తదనం ఉంది. తానెరిగిన నగేష్‌కీ ఈతడికీ తీరులో ఎంతో కొంత తేడా ఉంది. ఇప్పుడు ఇతగాడి పరిస్థితి బాగా చక్కబడేనా ఉండాలి, లేదా పైనపటారం లోన లొటారం అయినా వింత కాదు.

"చాలా రోజులు...కాదు...కాదు ఏళ్లే అయింది. ఎన్నేళ్లబ్బా! ఇరవై అయిదు...ఎనభై అయిదు...ఇరవై...ఇరవైయేళ్లు అయ్యింది. నిన్న మొన్నటి లాగుంది కదూ!" నగేష్.

ఆ...ఆ ఉంటుంది. నీకు అలాగే ఉంటుంది నాయినా! నాకో...నాకు కొన్ని యుగాల్లా ఉంది - మళ్లా ఆలోచనల్లో పడిపోయేడు - కాళీ ప్రసాద్.

రోడ్డున పోతున్న జనం, రోడ్డు మధ్యన నుంచున్న వీళ్లని వింతగా చూస్తూ వెళ్ళిపోతున్నారు. ఒకరిద్దరు - నిలబడి మరీ - చోద్యం చూస్తున్న వాళ్లలా నిల్చుండి పోయేరు. నగేష్‌కి ఇబ్బందిగా ఉంది.

"మీరు ప్రకాశరావు పేటలో ఉన్నప్పుడు మీ పక్క వాటాలో ఉండేవాళ్లం. వీణ, విజయలక్ష్మి మా చెల్లెళ్లు జ్ఞాపకం ఉన్నారా!"

కాళీ మనసు ఎక్కడో ఉంది. పాత స్మృతులు తవ్వుకుంటున్న కొద్దీ గుండె మంట రాజుకోవటం పెరుగుతోందే గానీ తరగడం లేదు.

'బోయ్!బోయ్!!'-లారీ హారన్ మోగింది. కాళీని రోడ్డు పక్కకు లాగేడు నగేష్. ఇహలోకంలోకి వచ్చిన కాళీ-

"ఆ...అవును.జ్ఞాపకం వచ్చింది. ఇరవై య్యేళ్లు...ఔను-ఇరవై. చాలా కాలమే ...నాకు గమ్మున జ్ఞాపకం రాలే! అంతే...అంతే..." తన జవాబు తనకే అసంగతంగా పేలవంగా వినిపించింది. నగేష్‌కి ఇదేం పట్టలేదు.

"అమ్మయ్య! బ్రతికించావ్!" అంటూ తను అతడ్ని ఎలా గుర్తుపట్టిందీ వగైరాలు గడగడా చెప్పేస్తున్నాడు. చాలా కాలంకి బాల్యమిత్రుడ్ని కలియడంలో ఉన్న ఆనందం అతడ్ని ఆగనివ్వటంలేదు.

తను ఊళ్లోకి వచ్చి ఎన్నాళ్లయ్యిందీ, పాత మిత్రుల కోసం ఎంతగా గాలించిందీ, ఒక్కళ్లనైనా ఎందువల్ల కలియలేకపోయిందీ, ఆఖరికి ఈ రోజు ఇలా అప్రయత్నంగా అతడ్ని కలియడం వల్ల ఎంత ఆనంద మయ్యిందీ...ఓ...ఏదేదో బడబడా మాట్లాడేస్తున్నాడు.

అదంతా వింటున్నట్లుగా కాళీ ఊకొడుతూనే ఉన్నాడు. కానీ, తన ఆలోచనల్లో తను కొట్టుకుపోతూనే ఉన్నాడు.

రెండు వందలు...ఇరవై ఏళ్ల క్రితం రెండొందలు. ఇప్పుడు దాని విలువ ఎంతో!?

రెండు వందలు మాత్రం కాదు...ఎక్కువే ఉంటుంది...ఓ వెయ్యుం టుందా! ఎన్నింతలు ఉంటుంది? మూడా!...అయిదా!...ఏడా!...పదా!...

ఆర్థిక శాస్త్రంలో ఎక్కడో చెప్పే ఉంటారు. డిగ్రీ తీసుకొని రెండు దశాబ్దాలు దాటింది. ఎవడికి గుర్తుండి చస్తుంది.

అప్పట్లో రెండొందలకి ఏమొచ్చేదబ్బా!...దరాదరి తులం బంగారం - అని జ్ఞాపకం. ఇప్పుడో తులం రెండువేల నాలుగొందలట. అంటే...పన్నెండింతలు. అబ్బో! చాలా ఎక్కువే!...

ఆ...బియ్యం బస్తా వంద చిల్లర కాబోసు...ఇప్పుడు మూడొందల చిల్లర... మూడింతలు...ఇది మరీ తక్కువ.

ఆ...జ్ఞాపకం వచ్చింది. అప్పట్లో రూపాయి విలువెంత!?...ఇప్పటిదొకటి తెలిసి ఏడ్చింది కనకా...

సరే!కాకుల్లెఖ వేద్దాం...ఐదు...తక్కువలో తక్కువ అయిదు రెట్లు తీసు

కుంటే...వెయ్యి...వెయ్యి రూపాయలు...తక్షణం వెయ్యి రూపాయలు దొరికితే... పెళ్లిలో అలకపాన్పు మీద ఇస్తానన్న ఫేను కొనేసి చెల్లెలు కాపురం అర్జంటుగా నిలబెట్టేవచ్చు. ఆపైన మిగిలిన దానితో...

అలా లెక్కల్లో ఎంతసేపైనా తేలిపోగలడు అతడు. తీరిక సమయాల్లో అతను చేసేపనే అది.

"ప్రసాద్! ప్రసాదూ! ఏమిటలా ఆలోచిస్తున్నావ్!" అంటూ అతనిని కుదిపి మరీ అడిగేడు - నగేష్.

"అదే...పాతరోజులు...జ్ఞాపకం చేసుకుంటున్నాను."

"అమ్మా! నాన్నగారూ! తమ్ముళ్లూ, చెల్లీ...అంతా బాగున్నారా!"

"..."

జవాబివ్వని కాళీని పరీక్షగా చూసేడు నగేష్. తానెరిగిన కాళీ కాదు ఈతడు.

ఈ మనిషిలో ఆనాటి దర్జా...హుందా...చలాకీతనం లాంటివి మచ్చుక్కూడా కానరావటం లేదు. తను ధరించిన దుస్తుల్లాగే మనిషి కూడా జీర్ణావస్థలో ఉన్నాడు. తల చెదిరి పోయి, జిడ్డోడుతున్న ముఖంతో, పడుతూ లేస్తూ సుదూర గమ్యం చేర ప్రయత్నిస్తున్న పథికుడిలా ఉన్నాడు.

"ఏమిటిలా అయిపోయేవ్! జబ్బు పడ్డావా?"

ఎలా ఉన్నాను! బాగానే ఉన్నానే. నాకేమయింది? ఏమీ అవలేదు. నాకేమీ కాదు. ఓహో...నువ్వెరిగినట్టు లేననా!-మళ్లా స్వగతంలోకి జారిపోయాడు.

ఎలాగుంటాను!?...నువ్వు ఇంకో పది పదిహేను రోజుల్లో ఈ ఊరువిడిచి పోతావనగా, మా దౌర్భాగ్యం మొదలయింది. నీకు తెలియదులే. నీకే కాదు ఈ లోకంలో ఎవ్వరికీ తెలియదు...

పెద్ద కొడుకుని అయినందుకు నాకు, ఇల్లాలైనందుకు మా అమ్మకి తెలుసు. ఇంటా బయటా దొరికినంత దొరక పుచ్చుకొని...పరారీ...నాన్న పరారీ. ఎందుకో మా ఇద్దరికీ తెలుసు. చిన్న పిల్లలకి చెప్పలేదు. అంతా గప్ చిప్... పరువు...పరువు...

అమ్మ బెంగతో మంచం ఎక్కేసింది. రేపో...మాపో అన్నట్టుండేది. మందులు...మందులు...అందుకు కావాలి డబ్బులు...డబ్బులు...డబ్బులు...

ఆ డబ్బుల కోసమే నీ చుట్టూ కాళ్లకి బలపాలు కట్టుకొని మరీ తిరిగేను. ఇదిగో అన్నావ్ - అదిగో అన్నావ్...రేపు-మాపు...ఉదయం-సాయంకాలం...ఏడు-తొమ్మిది...ఓరోజు...తెల్లారేసరికి...మానాన్నలా...నువ్వు అయిపూ గయిపూ లేకుండా పారిపోయేవ్...

అమ్మ చచ్చిపోయింది. ఒక్కగాని ఒక్క పెద్దదిక్కూ పోయింది. చిన్నవాడిని అణాకాణీ జీతగాడ్ని - ఐదుగురు చిన్న పిల్లల భారం మోయాల్సొచ్చింది ఒక్కళ్లా సాయంకి రాలా! దీనిక్కారణం ఎవరు!?...


నిన్నేమైనా అప్పడిగేనా! దానం చెయ్యమన్నానా! నీకు పీకల మీదకొస్తే, నా కాళ్లా వేళ్లాపడితే, నా తల తాకట్టుపెట్టి తెచ్చి నీ చేతుల్లో పోసిన అప్పు తీర్చమన్నాను. అవసరానికి తీర్చలేదు. కనీసం మాట మాత్రంగానైనా చెప్పకుండా మాయమైపోయేవ్!... నేనెలా ఉంటే నీకేం!? ఆర్చేవాడివా! తీర్చేవాడివా!?...ఆ రెండొందలకీ ఆనాడే ఆశ వదిలేసుకున్నాను. బేడ్ డెట్!...


అతని ఆలోచన్లు అతనివి. నగేష్ సొద నగేష్‌ది.

"-అలా అనుకోకుండా ఊరు విడిచి మెడ్రాస్ వెళ్లిపోయేనా!" అంటూ తన గత చరిత్ర చెప్పసాగేడు.

ఏదో షిప్పింగ్ కంపెనీలో చేరేడట. చాప్పన్న దేశాలు తిరిగేడట. బాగానే సంపాదించేడట. ఈ ఊళ్లో కట్టించిన బంగ్లా అద్దెకిచ్చేస్తాడట. ఆ పని మీదే వచ్చేడట. ఇక్కడ పని వీలైనంత వేగంగా తెముల్చుకొని హైదరాబాద్ వెళ్తాడట. అక్కడే సెటిల్ అయిపోతాడట. చిన్న తరహా పరిశ్రమేదో స్థాపించబోతున్నాడట. అలా చెప్పుకుంటూ పోతే చెప్పటానికి ఇంకా చాలా ఉందట. కానీ, తనకింకెక్కడో ఏదో పనుందంటూ, వాచీ చూసుకొని, ఏదో జ్ఞాపకం వచ్చిన వాడిలా-

"ఆ...అన్నట్టు...నీ రెండొందల సంగతి...వెళ్లే ముందు మా బాబాయ్‌కి ఇచ్చేను. నీకు అందజేయమని. అతని సంగతి నీకు తెలుసు కదా!... ఆ తరువాత తెలిసిందిలే నాకు - అది నీకు అందలేదని. నీకు మనియార్డరు కూడా చేసేను. తిరిగొచ్చేసింది. మారిన ఎడ్రస్ నాకు తెలియలేదు. చాలా ప్రయత్నిం చేను"-






నగేష్.

'రెండొందలు' అన్న పదం కాళీని ఆకర్షించి, అతడి మాటల్ని శ్రద్ధగా వివనిచ్చింది. కానీ, గుండెల్లో రాజుకున్న మంట భగ భగ మండి పోతోంది.

ఛేష్!... అంతా శుద్ధ అబద్ధం... ఆ వీధిలోనే ఇంకో చిన్న వాటాలోకి మారితే ... ఎడ్రస్ దొరకలేదట. అబద్ధాల పుండాకోర్...

"సరే! ఇన్నాళ్లకు దొరికేవ్! ఇప్పుడైనా మించి పోయింది లేదు. నీ రెండొందలూ తీసుకొని నన్న ఋణ విముక్తుణ్ణి చేయి" అంటూ నవ్వేడు నగేష్.

చేస్తా! చేస్తా ...అని మనసులోనే మంటగా అనుకున్నాడు.

కేష్ బేగ్ లోంచి సరికొత్త ఇరవైరూపాయల నోట్ల కట్టొకటి తీసి, అందులోంచి కొన్ని నోట్లు లెఖ్ఖ పెట్టి విడదీసి తన చేతికందిస్తున్న నగేష్‌నీ, నోట్లనీ మార్చి మార్చి చూస్తూ-

"ఎంత?" అడిగేడు కాళీ.

"రెండొందలు"-ఇంకెంత అన్నట్టుగా మిత్రుడ్ని వింతగా చూసేడు.

"వడ్డీయో!"

"వడ్డీయా!?" అని ఆశ్చర్యపోయి, కొంతసేపు ఆలోచించి-

"ఎంత!? " అన్నాడు నగేష్.

"వడ్డీ పిధ్నాలుగొందలు. అసలు రెండొందలు. వెరసి పదహారు. స్థాణువులా నిలబడిపోయేడు నగేష్. ఇద్దరిలో ఎవరికి పిచ్చన్నట్టు చూస్తున్నాడు అతను.

"ఎందుకలా ఆశ్చర్యపోతావ్! నేన్నీకు చెప్పాలా! నేడు బేంకులో రెండొందలు వేస్తే ఇరవై ఒక్క ఏళ్లలో పదహారొందలు అవుతాయ్. వెనకటి రోజుల్లో వడ్డీ రేట్లు తక్కువ కాబట్టీ పదిహేనొందలు చేసుకో..."

నగేష్ అలా తెల్లబోయి చూస్తూనే ఉన్నాడు.

"...అర్థం కాలే! రెండొందలు ఏడేళ్లలో నాలుగు. ఆ నాలుగు మరో ఏడేళ్లలో ఎనిమిది. ఆ ఎనిమిది..." అంటూ వడ్డీ లెఖ్ఖలు బోధపరుస్తున్నాడు కాళీ. నగేష్‌కి ఆ లెఖ్ఖ అర్థం కాక కాదు, తానూహించని ధోరణిలో మాట్లాడుతున్న మిత్రుడ్నీ - తెల్లబోయి - వింతగా చూస్తున్నాడు.

అతనిలో 'రియాక్షన్' చూసిన కాళీకి భయం వేసినట్టుంది-

"మరెంతిస్తావ్" అనడిగేడు.

ఐదు శాతం. అంటే వడ్డీ అసలూ కలిపి నాలుగొందలు-అంటూ తానూ వడ్డీ లెఖలు చెబుదామనుకున్నాడు గానీ నగేష్‌కి గొంతు పెగల్లేదు.

కాళీ - అతని చూపుల్లోనే అతని భావం చదివేసినట్టున్నాడు.

"ఒక పనిచెయ్! మధ్యేమార్గం చెబుతాను. బేంకు వడ్డీ పద్దెనిమిది శాతం - అప్పు మీద. అసలు రెండొందలు వడ్డీ ఏడొందల ఇరవై. మొత్తం తొమ్మిదొందల ఇరవై. వడ్డీలకి వడ్డీ అంతా కలిపి ... వెయ్యి చేసుకో ... "

నగేష్ మాట్లాడ లేదు.

కొద్దిసేపు ఒకళ్లనొకళ్లు సూటిగా చూసుకున్నారు. ఆపైన కాళీ తన చూపును తప్పించి-

"ఒక వేళ నీకు వడ్డీ ఇవ్వడం ఇష్టం లేకపోతుందీ - అప్పుడు అసలు కూడా నువ్వు ఇవ్వనఖ్ఖర్లేదు. నీ దార్న నువ్వెళ్లిపో...నా దార్న నేనెళ్లిపోతాను" ఇరవై ఏళ్ల క్రితమే నేన్నీకిచ్చిన రెండొందలకీ ధారాదిలేసేను -అన్నట్టుంది కాళీ గొంతు.

గొంతు ధీమాగానే పలుకుతున్నా మనిషి లోలోన నిలువెల్లా వణికిపోతున్నాడు.

అతడు వణికిపోతున్నట్టు నగేష్‌కి స్పష్టంగానే తెలుస్తోంది.

చిన్ననాటి కాళీ గూర్చి అతనికి తెలియంది లేదు. అప్పట్లో తామిద్దరూ కలిసి చదరంగమో, పేకో ఆడని రోజే లేదు.

ఉత్తరోత్తరా ప్రత్యర్థిపై తనది పై చేయి అయ్యే అవకాశం వస్తుందనిపిస్తే ఆట తొలిదశలోనే బలమైన పావుని ఫణంగా పెట్టి - 'గేంబిట్'-ఆడాలన్నా-

తన చేతిపై ఆటగాడి చేతిలోంచి తనక్కావల్సిన ముక్క కోసం వల-ట్రేప్ వేయాలన్నా-

తనకే చెల్లు. అలా చేయటం అతనికి చేత కాదు. అతడు ఎప్పుడూ 'డిఫెన్సివ్' (ఆత్మరక్షణ తరహా) ఆటగాడే. ఖర్మంచాలక ఎప్పుడైన 'అఫెన్సివ్' ఎత్తు వేసేడా...ఇదిగో ఇలాగే వణికిపోయి ప్రత్యర్థికి పట్టుబడిపోయేవాడు.

అలా పట్టుబడి పోవటం నామోషీగా అనిపించి, పట్టుదలతో తరువాత్తరువాత అలాంటి 'గేంబిట్' ఎప్పుడూ చేసేవాడు కాదు.

గేంబిట్...ఏదో పెద్ద పందెమే ఫణం పెట్టి జూదం ఆడుతున్నాడు-ఇప్పుడు.

ఈ మనిషి ఆర్థిక పరిస్థితి ఏమిటో!? వ్యసనాలకి చిక్కి చితికిపోయేడా! జీవితం నెత్తిన చరచ బట్టి ఇలా తయారయ్యాడా!

వస్తుతః మనిషి మంచివాడే. నిజానికి ఆనాడు అతడలా ఆదుకోబట్టే ఈనాడు తను ఇలా - ఇంత పెద్దవాడు అయ్యేడు.

అడిగినంతే కాదు. అంతకు పదిరెట్లు ఇచ్చినా అతని ఋణం తీరదు. ఇవ్వడం తనకి కష్టమూ కాదు.

కాళీని మరోసారి పరీక్షగా చూసేడు. అతని చూపులో మార్పులేదు.

ఆ పేదవాడి కళ్లలో కనిపించే ఛాలెంజ్ నగేష్‌ని వ్యగ్రుణ్ణి చేస్తోంది.

వెంటనే అతడు ముఖం సీరియస్‌గా మార్చేసి ఫక్తు 'బిజినెస్ ఆఫర్లా' ఓ మాటన్నాడు.

"నువ్వు అడిగినంత వడ్డీ ఇవ్వగలిగినా నేనివ్వను. అసలు రెండొందలు. ఆపైన మూడొందలు. మొత్తం అయిదొందలు. కావలిస్తే తీసుకో, లేకపోతే వదిలేయ్" అన్నాడు నగేష్.

అతడి కళ్లలోకి చూస్తూ, తే-అన్నట్టు చేయి చాపేడు-కాళీ.

అతడు ఇచ్చిన ఇరవైలు పాతికా తన జేబులో పెట్టుకొని, మిత్రుడి ముఖమైనా చూడకుండా తన దార్న తాను నడచిపోతున్నాడు.

అతడు ఎక్కడున్నాడో, ఏ దార్న పోతున్నాడో అతనికి తెలియటం లేదు. అతని కళ్లకెదర కనిపిస్తున్నది-

తొలి ఏడాది పండక్కి వచ్చి ఆరు నెలలుగా పుట్టింటే ఉండిపోయిన చెల్లెలి దీనమైన ముఖం.

ఆ తరువాత షోరూమ్‌లో నిగనిగ మెరిసిపోతున్న కొత్త టేబిల్‌ఫేన్. ఫేన్ తిరగటం మొదలు పెట్టింది. దాని మీద వికసించనున్న పద్మంలా తన చెల్లెలి అందమైన ముఖం. ఫేన్ స్పీడు అందుకుంటున్న కొద్దీ ఆ ముఖంలో నవ్వుల పువ్వులు వెల్లివిరిస్తున్నాయి.

అతని మనసిపుడు చాలా తేలికగా ఉంది. అడుగులు హుషారుగా వేగంగా పడుతున్నాయి.

నగేష్ అల్పత్వం, షోడౌన్ కొచ్చేసరికి తన ఓటమి కాళీ గుర్తించక పోలేదు. ఏమైనా ఓ సంసారం నిలుస్తోంది.

గరిక తిన్న గాడిద చెడుతుంది. గరికికి సేగి లేదన్న వేదాంతం చాటున తన ఓటమిని సమర్థించుకుంటున్నాడు కాళీ.

పేద తనంలో మనిషి బతకటానికి ఏదోఒక మత్తు కావాలి - కనీసం ఈ రకమైనా చాలు- బాధను మరిచిపోడానికి.